జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 7-1-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 212 పేజీలు: 4 వెల : రూ.7

# మత్తులో.. ఊళ్లు..



* పల్లెపల్లెకు విస్తరించిన బెల్టు షాపులు
* నిత్యం పట్టుబడుతున్న మద్యం బాటిళ్లు
* బెల్టు షాపులకే మద్యం విక్రయిస్తున్న వ్యాపారులు
* బెల్టు లేకుంటే వ్యాపారం సాగదంటూ ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి
* నిబంధనలు పాటించని వ్యాపారులు
* ప్రైవేట్ మద్యం షాపుల వద్ద కొరవడిన నిఘా
* సారా నియంత్రణకు పరిమితమవుతున్న ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు
* బెల్టు షాపులపై మొక్కుబడిగా ఎక్సైజ్, పోలీసుల దాడి

**శ్రీకాకుళం క్రైం, జనవరి 6(వార్త):** జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. వీధి చివర, ఇంటి పక్కన.. ఇలా ఎక్కడ చూసినా మద్యం బెల్టు షాపులే. ఫోన్ కొడితే ఇంటికే మద్యం డెలివరీ అవుతోంది. మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి, అధికారులు చెప్పే మాటలన్నీ నీటిమూటలేనని.. వాస్తవం వేరని చెప్పడానికి.. జిల్లాలో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్న బెల్టు షాపులే సాక్ష్యాలు. ఊళ్లని మత్తులో మునిగితేలుతున్నాయి. లక్షలు పోసి మద్యం షాపులకు టెండరు పాడామని, ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయిస్తే లాభాలు మాట అటుంచితే లాసై పోతామని నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. లూజు సేల్ కన్నా బెల్టులకే విక్రయిస్తేనే మాకు లాభమని పేర్కొంటున్నారు. అయితే ఈ ప్రైవేట్ మద్యం షాపులను నిర్వహిస్తున్న వారిలో అధిక మంది అధికార పక్ష నాయకులు, కొందరు ఎమ్మెల్యేల అనుచరులే కావడంతో ఎక్సైజ్, పోలీసు శాఖాధికారులు సైతం చూసీచూడనట్టు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు కేవలం నాటుసారా నియంత్రణకే దృష్టిపెడుతున్నారు తప్ప ప్రైవేట్ మద్యం షాపుల వద్ద ఎటువంటి నిఘా పెట్టడం లేదు. దీనివల్ల బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారు యధేచ్ఛగా మద్యం నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితో బెల్టు షాపులను దాడులు ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం దాడులు చేయడం లేదు. ఏదో మొక్కుబడిగానే తనిఖీలు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారన్న సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

## అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

**పలాస:** అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. పలాస ఇందిరా చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన కర్ని అభిలాష్, నందిగాం మండలానికి చెందిన అంబలి ఠాగూర్ మోటార్ సైకిల్‌పై 47 క్వార్టర్స్, 15 ఫుల్ బాటిల్స్‌ను తరలిస్తూ పట్టుబడ్డారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు.






జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్యామలాపురం ఆర్ఆర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**ఎల్ఎన్ పేట, జనవరి 6(వార్త):** శ్యామలాపురం ఆర్అండ్ఆర్ కాలనీలో రాగోలు జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ బలగ లక్ష్మీ, గోవిందరావు తెలిపారు. ఈ శిబిరంనకు వచ్చిన రోగులందరికీ అన్ని రకాల మందులు ఉచితంగా ఇవ్వడం జరిగిందని డాక్టర్ లిఖిత తెలిపారు. ఈ శిబిరం మంగళవారం కూడా కొనసాగుతుందన్నారు.

కార్యక్రమంలో జెమ్స్ హాస్పిటల్ సిబ్బంది, ఎల్ ఎన్ పేట మండల పిఆర్ఓ కె.అర్జునరావు, గ్రామస్తులు బాణాల దాలిరాజు, కోటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



# ఇంటికో వ్యాపారవేత్తే లక్ష్యం

**- సీఎం చంద్రబాబు 2047 విజన్ ఇదే**

**- భవిష్యత్‌లో శ్రీకాకుళం నియోజకవర్గానికి రూ.100 కోట్ల డ్వాక్రా రుణాలు**

**- ఎమ్మెల్యే గొండు శంకర్**

**- జిల్లా కేంద్రంలో డ్వాక్రా బజారు ప్రారంభం**



**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** ఇంటికో వ్యాపారవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు 2047 విజన్ సిద్ధం చేశారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి జంక్షన్‌లో డ్వాక్రా బజారును సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలని తలచి చంద్రబాబు డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. నాటి ఆ ఆలోచనే నేడు ఓ కుటుంబానికి ఆర్థికవేత్తగా మహిళలందరూ ముందుండి నడిపిస్తున్నారన్నారు. నాడు చంద్రబాబు 2020 విజన్ ప్రవేశపెట్టినప్పుడు కొందరు హేళన చేశారని, కానీ నేడు ఇంటికో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉన్నారని చెప్పారు. భవిష్యత్‌లో శ్రీకాకుళం నియోజకవర్గంలో రూ.100 కోట్ల డ్వాక్రా మహిళలకు రుణాలు అందజేస్తామని హామీనిచ్చారు. డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ డ్వాక్రా బజారు ఈ నెల 11 వరకు కొనసాగుతుందని తెలిపారు. కొయ్య బొమ్మలు, చెక్క బొమ్మలు, చేనేత వస్త్రాలు, పొందూరు ఖద్దరు, ఆత్రేయపురం పూతరేకులు, మందస కోవా, పలాస జీడిపప్పు, జనపనార బ్యాగులు, మట్టి గాజులు, సహజ సిద్ధంగా తయారుచేసిన పచ్చళ్లు, పట్టు వస్త్రాలు, మాడుగుల బెల్లం, గోపి మంచూరియా, పట్టు వస్త్రాలు, సిక్కోలు ప్రజలు తయారుచేసిన డెకరేషన్ ఫ్లవర్స్, బాపట్ల పట్టు వస్త్రాలు, అరకు కాఫీ పొడి, బొమ్మల కొలువు, ఇంట్లో వినియోగించే పింగాణి వస్తువులు, ప్లేట్లు, గ్లాసులు, చేతి వృత్తులచే తయారుచేసిన మట్టి గ్లాసులు, మట్టి పాత్రలు, మట్టి కుండలను అమ్మకాలకు ఉంచామన్నారు.

కార్యక్రమంలో సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, రెడ్డి గిరిజాశంకర్, పాండ్రంకి శంకర్, కెల్ల కొండలరావు పాల్గొన్నారు.

# సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం



**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** సైకిల్ తొక్కడంతో ఆరోగ్యం పదిలమని శ్రీకాకుళానికి చెందిన సైక్లిస్ట్ కాపవరపు సీజు అన్నారు. వృత్తి, చదువుల రీత్యా చాలామంది వ్యాయామానికి దూరమవుతున్నారని, శారీరక శ్రమ తక్కువ కావడం, చిన్నవయసులోనే అధిక బరువు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వ్యాయామం చేయడానికి అవకాశం లేని వారికి సైకిలింగ్ బెస్ట్ ఆప్షన్ అని నిపుణులు చెబుతున్నారన్నారు. ఆఫీస్, షాపింగ్‌కు వెళ్లేప్పుడు సైకిల్ వినియోగిస్తే, ఫిజికల్‌గా యాక్టివ్‌గా ఉండటంతో పాటు, శరీరానికి వ్యాయామం అందుతుందని, రోజులో కనీసం 30 నిమిషాల పాటు సైక్లింగ్ చేస్తే అనేక లాభాలు ఉన్నాయని, బరువు తగ్గాలనుకునేవారికి సైక్లింగ్ ఒక మంచి మార్గమన్నారు. సైకిలింగ్ జీవక్రియ రేటును మెరుగుపరచి, కండరాలను పెంచి, శరీరంలో కొవ్వును కరిగిస్తుందన్నారు. ప్రతిరోజూ అరగంట సైకిల్ తొక్కితే ఒక ఏడాదిలో దాదాపు ఐదు కిలోల కొవ్వును కరిగిస్తుందన్నారు. సైక్లింగ్ మీ గుండె కండరాలను, రెస్టింగ్ పల్స్, రక్తంలో కొవ్వు స్థాయిలను తగ్గిస్తుందని, రోజు సైక్లింగ్ మీ గుండె, ఊపిరితిత్తులు, రక్త ప్రసరణను మెరుగుపరిచి, హృదయ సంబంధ సమస్యలను తగ్గిస్తుందన్నారు. లయన్స్ క్లబ్ సెంట్రల్ మెంటార్ నటుకుల.మోహన్ మాట్లాడుతూ నడిచినప్పుడూ, పరుగుపెట్టినప్పుడూ మోకాళ్లూ, వెన్నుపై కొంత ఒత్తిడి పడే ఆస్కారం ఉంటుంది. కానీ, సైకిలు తొక్కడం వల్ల కీళ్లపై పడే ఒత్తిడి తక్కువ, ప్రయోజనాలు ఎక్కువన్నారు. సైకిలు తొక్కినప్పుడు మెదడు నుంచి న్యూరోట్రాన్స్‌మీటర్లు విడుదలవుతాయని, ఇవి జీవక్రియల పనితీరును మెరుగుపరచి, ఏకాగ్రత, చురుకుదనం కూడా పెరుగుతాయన్నారు. స్త్రీలు వారంలో మూడురోజులు కొంత సమయం సైకిల్ తొక్కడం వల్ల శరీరం యవ్వనంగా మారడమే కాకుండా నెలసరి సమయంలో వచ్చే నొప్పులూ తగ్గుతాయన్నారు. సిజేరియన్ల కారణంగా వచ్చిన వెన్నునొప్పి అదుపులోకి వస్తుందని తెలిపారు. ప్రతీ ఆదివారం శ్రీకాకుళం సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సైక్లింగ్ చేస్తామని, పాల్గొనాలనే కునేవారు తమ సైకిల్‌తో ఉదయం ఆరుగంటలకు స్థానిక ఏడు రోడ్ల కూడలికి చేరుకోవాలని కోరారు. ఈ సైక్లింగ్‌లో జామి మణి, కరణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'జాయ్ కిడ్స్'స్కూల్‌కి గ్లోబల్ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు



**-ప్రత్యేకంగా అభినందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు,**

**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీలో కొన్నేళ్లుగా అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్న జాయ్‌కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కి అరుదైన గౌరవం లభించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ఈ స్కూల్‌కి జాతీయ స్థాయి'గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు' వరించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశయమైన వికసిత్ భారత్-2047 సాధనలో భాగంగా.. భారతీయ హ్యూమన్ రైట్ కౌన్సిల్(బీహెచ్ఆర్సీ) అనే జాతీయ సంస్థ ఈ అవార్డును ఆ స్కూల్ కరస్పాండెంట్ జామి స్రవంతి కిరణ్‌కి బహూకరించింది. ఈ మేరకు సర్టిఫికెట్‌ను అందజేసింది. ఆమెను కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, నగరంలోని పలువురు ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్న అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

# రక్తదానానికి కదలిరండి

**- రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు**

**-రక్తదానం చేసిన వికలాంగుడు మధుసూదన్**

**అరసవల్లి, జనవరి 6(వార్త):** తాను సైతం రక్తదానం చేయడం ఆనందంగా ఉందని, రక్త సేవకు అంగ వైకల్యం అడ్డుకాకూడదని అరసవల్లికి చెందిన మధు సూదనరావు అన్నారు. నగరంలో ఆరు రక్త నిధి కేంద్రాలున్నా, రక్త కొరత తీరటం లేదని, జిల్లాలో రక్త కొరత తీరాలంటే దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని ఈ రోజు పురుషులకు ధీటుగా మహిళలు ముందుకువస్తున్నారని, ముఖ్యంగా యువత సేవా దృక్పథంతో ఆలోచించి ప్రాణదాతలుగా మారాలని, అప్పుడే పది మంది ప్రాణాలు కాపాడగలమని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు అన్నారు. ఈ రోజు రక్త నిధులు తక్కువగా ఉన్నాయని టలంటీర్లను కోరగా, తక్షణమే స్పందించి రక్తదానం చేసిన మధుసూదన రావును అభినందించారు. శిబిరంలో ఏపీఆర్వో నంది ఉమాశంకర్, టెక్నీషియన్ వెంకటేష్, సభ్యురాలు కోమలి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.






## ప్రజారోగ్యం కోసమే ప్రకృతి వ్యవసాయం

**పోలాకి, జనవరి 6(వార్త):** ప్రకృతి వ్యవసాయం ప్రజారోగ్యం కోసమేనని మండల తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ ప్రాంగణంలో ప్రకృతి సేద్య ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యం పంటలతో రోగ నిరోధక శక్తి పెరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి చిరంజీవి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ టి.రమణమూర్తి, యూనిట్ ఇన్‌చార్జి బి.సీతారామయ్య, ఐసీఆర్ పీఎస్ రమణమూర్తి, జ్యోతి, దమయంతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## మందస కొయ్య బొమ్మలకు జిల్లాస్థాయి గుర్తింపు



**మందస, జనవరి 6(వార్త):** చిన్నబరంపురంలోని స్వయంశక్తి సంఘాలు తయారు చేసిన హస్తకళలు, కొయ్య బొమ్మలుకు సిక్కోలు డాక్రా బజారులో మంచి గుర్తింపు వచ్చినట్లు వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ఈ బొమ్మలు అధికంగా అమ్ముడుపోయాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు తారక మోహన్, స్వామినాయుడు, ముఖలింగం, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాంతమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత




**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చటంలో అందరూ భాగస్వాములులు కావాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. ఆదివారం నరసన్నపేటలో జరిగిన 3వ డిస్ట్రిక్ట్ కేబినెట్ సమావేశంలో లయన్స్ గవర్నర్ ప్రొఫెసర్ ఎన్వీబీఎస్ఎస్ ప్రసాద్ గుడ్డ సంచులను ప్రారంభించి, స్థానిక మార్కెట్ యార్డులో ప్రజలందరికీ సుమారు 300 సంచులను అందించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలతోపాటు, భవిష్యత్ సేవా కార్యక్రమాలను, శాశ్వత సేవలను నిర్ణయించారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో భవిష్యత్‌లో అనేక అనారోగ్యాల బారిన పడతామని, నవ సమాజ నిర్మాణమే ధ్యేయంగా మనమంతా కలసి ముందుకు వెళ్దామన్నారు. గుడ్డ సంచులను వెంటపెట్టుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డా.బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శి డా.పైడి సింధూర, ట్రెజరర్ జోగి భారతి, మెంటార్ నటుకుల మోహన్, సభ్యులు శిల్లా మణి, పొడుగు చరణ్, ప్రదీప్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవంలో మణిపాత్రునికి సన్మానం

**పోలాకి జనవరి 6(వార్త):** యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన వేలాది మంది ఉపాధ్యాయుల సమక్షంలో తనకు సన్మానం జరగడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కె.లక్ష్మణరావు ఐ.వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిశోర్‌కుమార్, రెడ్డి మోహన్‌రావు, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎచ్చెర్ల మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నీలయ్యకు పదవిపై దళిత సంఘాల హర్షం



**వంగర, జనవరి 6(వార్త):** సీనియర్ దళిత నేత, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జరజాన నీలయ్య రాజాం ప్రభుత్వా సుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులవ్వడంపై దళిత బహుజన జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సంద ర్భంగా దళిత బహుజన జేఏసీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మజ్జి గణపతి, దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.గణపతిరావు మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యా యుడిగా, రాజాం నియోజకవర్గ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా నీలయ్య దళిత బహుజన సమస్యల పరిష్కా రానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో దళిత నాయకులు గంగులు, బుజ్జి, ఏజ్జల అప్పలస్వామి, డి.రాంబాబు, రాజు, రామారావు, సింహాచలం, జి.గణపతి, మన్మధరావు, సాయి, చంటి తదితరులు ఉన్నారు.



## స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి

**శ్రీకాకుళం, జనవరి 6(వార్త):** శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల కళాశాల, ఆర్ట్స్ కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, ర్యాష్ డ్రైవింగ్‌ను నియంత్రించాలని కలెక్టర్‌ను ఏబీవీపీ నాయకులు కోరారు. కళాశాల ప్రారంభం, విడిచి పెట్టే సమయంలో కొంతమంది ఆకతాయిలు విద్యార్థినులకు ఇబ్బంది కలిగిస్తున్నారని, వారికి రక్షణ కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి, రాష్ట్ర కన్వీనర్ తుమ్మగంటి వంశీ పాల్గొన్నారు.

## కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**మందస, జనవరి 6(వార్త):** కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో సత్తా చాటారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గవ్వ భీమారావు తెలిపారు. పలాస మండలం గురుదాసుపురంలో జరిగిన పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి షీల్డ్, రూ.5000లు, వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటలో జరిగిన పోటీల్లో తృతీయ స్థానం సాధించి షీల్డ్, రూ.3000లు బహుమతిని కైవసం చేసుకున్నారన్నారు. విజేతలు పైల కీర్తన, నెయ్యల భార్గవి, కోమటి జ్ఞానేశ్వరి, ఠాకూర్ గౌతమ్, కోమటి శ్రీజను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.దామోదరం, ఎం.లక్ష్మణ రావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, బి.రమేష్, ఎస్.హారిక, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉషారాణికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం



**రాజాం, జనవరి 6(వార్త):** జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బుచ్చింపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని వడ్డి ఉషారాణిని విజయవాడకు చెందిన భారత్‌చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్, ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, ప్రముఖ సినీనటి రేణు దేశాయ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారంతో సన్మానించారు. నూతన సృజనాత్మక, మెలకువలతో నిరంతరం విద్యార్థులను తీర్చిదిద్దుతుండడంతో ఆమెకు ఈ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా ఆమెను జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు.

## సమస్యలు పరిష్కరించాలి

**పలాస, జనవరి 6(వార్త):** కాష్యూ లేబర్ ల సమస్యలు పరిష్కారం చేయాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ పలాసతహసీల్దార్ కి కళ్యాణ్ చక్రవర్తికి సోమవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేస్తూ క్యాష్యూ లేబర్ అసోసియేషన్ సంఘ నాయకులు మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 250 జీడి పరిశ్రమలు నెలకొల్పి ఉన్నాయిని,జీడి పరిశ్రమంలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వము నుండి రావలసిన రాయితీలు రావడం లేదుని, ప్రభుత్వపరమైన కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ఈ ఎస్ ఐ, పిఎఫ్, గ్రాడ్యూటి మొదలగు పథకాలు అమలు కావడం లేదుని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలలో కార్మికులకు కనీసం మౌలిక సదుపాయాలు యాజమాన్యం కల్పించడం లేదు. సమస్యలను పరిష్కారం చేయాలని స్థానిక తాహసిల్దార్ మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శిస్టు. గోపి ప్రధాన కార్యదర్శి అంబటి. ఆనందరావు, బమ్మిడి. సంతోష్ కుమార్, గజ్జి. బాలయ్య, పి. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## బాలల హక్కులకు భరోసాగా నిలవండి

**- మాజీ స్పీకర్ తమ్మినేని**




**ఆమదాలవలస, జనవరి 6(వార్త):** బాలల హక్కుల పరిరక్షణకు శతశాతం భరోసాగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం ఆయన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం సంస్థ లోగోను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలలపై రాష్ట్రంలో నిత్యం వెలుగులోకి వస్తున్న దాడులు, దండనలు, ఉల్లంఘనలు, లైంగిక కార్యకలాపాలను గమనిస్తే పోరాటాలకు చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం లాంటి సంస్థలు ముందుకొచ్చి ఆవిర్భావించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బాలల హక్కులు, వారి సంక్షేమం ప్రభుత్వేతర సంస్థల ప్రాతినిధ్యంలోనే సాకారమవుతాయన్నారు. వ్యక్తిగత ఎదుగుదలకు, అజెండాకు ప్రాధాన్యతనిచ్చి అప్రతిష్ట పాలవద్దన్నారు. ఈఫోరం అనతికాలంలో క్రమశిక్షణతో, చక్కని బాలల హక్కుల పరిరక్షణ సంస్థగా పేరు ప్రఖ్యాతలు గడించాలని ఆకాంక్షించారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి మాట్లాడుతూ బాలల హక్కులు,వారి సంక్షేమంపై పోరాటాలే కీలకంగా పని చేస్తామని తెలిపారు. త్వరలోనే నిష్ణాతులైన, ప్రభావశీలురు, న్యాయకోవిదుల సారథ్యాన వివిధ కార్యవర్గాల నియామకానికి కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి ఎంపీపీ కిల్లి సత్యనారాయణ, యువజన నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు, బాలల సంఘాల నాయకులు కొత్తకోట శ్రీనివాసరావు, బి.లవకుశ, బచ్చు లక్షణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాటిచ్చారంటే.. చేస్తారంతే..!

**-ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే శిరీష స్పందన భేష్**

**-నర్సిపురం పర్యటనలో ఆమె దృష్టికి పలు సమస్యలు**


**-రెండు రోజుల్లోనే పరిష్కరించిన వైనం**

**- ఆ గ్రామ వాసుల్లో వెల్లివిరిసిన ఆనందం**



**పలాస, జనవరి 6(వార్త):** మాటిచ్చారంటే... చేస్తారంతే.. అని మరోమారు నిరూపించారుని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 3న పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో నర్సిపురం గ్రామంలో ఆమె పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలు స్ట్రీట్ లైట్స్, రోడ్లు, మురుగు కాలువల అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం వీధిదీపాలను ఏర్పాటు చేయడంతో నర్సిపురం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకునికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని, మాటలు చెబుతూ కాలయాపన చేశారని గుర్తు చేసుకుంటూ మాటల మనిషికి.. చేతల మనస్తత్వానికి ఎంతో తేడా ఉందని అక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం : ఎమ్మెల్యే శంకర్



**గార, జనవరి 6(వార్త):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని వమరవల్లి పంచాయతీ గొర్రెలవానిపేటలో సోమవారం కమ్యూనిటీ భవనం రోడ్లకు ఎమ్మెల్యే శంకర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత వైసిపి హయాంలో గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో గ్రామాల్లో రోడ్లు కాలువలు శిథిలావస్థకు చేరిపోయాయి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అందిస్తున్నట్టు చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని నియోజకవర్గంలో అన్ని విధాల అభివృద్ధి చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ, ప్రజా దర్బారు కార్యక్రమాల్లో ప్రజల నుంచి రోడ్లు కాలువలు కావాలని వెనకాల ఎక్కువగా అందాయన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే శంకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో గార మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బలవంతపు భూ సేకరణను అడ్డుకుంటాం




**పలాస, జనవరి 6(వార్త):** పచ్చని ఉద్దానని సర్వనాశనం చేయొద్దని, కార్గో ఎయిర్పోర్ట్ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా దశలు వారి ఉద్యమాలను ఉధృతం చేస్తామని వామపక్షాల నేతలు సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ కార్యదర్శి చాపర వేణు, సిపిఐ ఎమ్ యల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సి పి ఐ యం యల్ లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిలి రామారావు,కార్గో ఎయిర్పోర్ట్ బలవంతపు భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు హెచ్చరించారు. కార్గో ఎయిర్పోర్ట్ భూ సేకరణకు వ్యతిరేకంగా పలాస ఆర్టిసి కాంప్లెక్స్ నుండి పలాస ఆర్డిఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్గో ఎయిర్ పోర్ట్ బలవంతపు భూసేకరణ ప్రతిపాధన ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 23 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా జీవనం సాగిస్తున్న ప్రజల ఆస్తులను బలవంతంగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి ప్రజలను నిరాశ్రయులను చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని,కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును వారు ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలు పక్షమా లేదా ప్రజల పక్షం ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అభివృద్ధి ముసుగులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్ల కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నయని వారు విమర్శించారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీ ఆస్తులుగా మార్చితే సహించేది లేదని వారు అన్నారు. మూలపేట కోర్టుకు కేటాయించిన 2279 ఎకరాల్లో కార్గో ఎయిర్పోర్ట్ కి 300 ఎకరాలు కేటాయిస్తే ఎటువంటి భూసేకరణ అవసరం లేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు, పోరాట కమిటీ నాయకులు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే మోహన్ రావు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంకల మాధవరావు. సిపిఎం నాయకులు ఎన్ గణపతి, కె కేశవరావు,టి అజయ్ కుమార్, లిబరేషన్ నాయకులు, డి శ్రీనివాస్,న్యూ డెమోక్రసి నాయకులు,జే వీరాస్వామి, పి కుసుమ, పి కె యస్ నాయకులు పి దుర్యోధన, కె పురుషోత్తం, సి హెచ్ రవి,తో పాటు పోరాట కమిటీ సెక్రటరీ జోగి అప్పారావు,నాయకులు రామస్వామి, సి హెచ్ వల్లభరావు, లండ భోజరాజు, శ్రీదేవి, సుశీల, మల్లేశ్వరి, గుంటు లోకనాదం, పొట్టి ధర్మారావు, నల్ల పరుశురామ్, రత్నల చలపతి, మైలపల్లి శేఖర్, గుంటు జోగిరాజు,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

**పలాస, జనవరి 6(వార్త):** పలాస మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడుతుందని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌జి యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ చినబాడాం ఫీడర్‌పై కొత్త విద్యుత్ స్తంభాలు వేయడంతో విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు. దీంతో పెంటిభద్ర , జయరామచంద్రపురం, పద్మనాభపురం, పాత జాతీయ రోడ్డు, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# మోదీ సభను విజయవంతం చేయండి

**కూటమి శ్రేణులకు ఎమ్మెల్యేలు కోండ్రు మురళి, బగ్గు, శిరీష, మామిడి గోవిందరావు పిలుపు**

**రాజాం, జనవరి 6(వార్త):** విశాఖలో బుధవారం జరిగే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కూటమి నాయకులను కోరారు.

సోమవారం ఆయన నియో జకవర్గ కూటమి నాయకులతో కలిసి శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ సభకు నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో విశాఖకు తరలి వెళ్లేలా నాయకులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి 67 బస్సులను సిద్ధం చేశామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, ప్రజలు ఈ బస్సుల్లో వెళ్లాలని సూచించారు. సొంత వాహనాలు ఉన్నవారు వాటిని ఉపయోగించాలని కోరారు. తొలుత ఈ సమావేశంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో కొండంపేటకు చెందిన సీనియర్ తెదేపా నాయకులు గుడివాడ ఉత్తరకుమార్ మృతిపై సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





**నరసన్నపేట, జనవరి 6(వార్త):** విశాఖలో జరగబోయే ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కోరారు. సోమవారం ఆయన నరసన్నపేట పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొని కూటమి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభజన హామీ అయిన విశాఖ రైల్వేజోన్‌కు శంకుస్థాపన, విశాఖ మెట్రో రైలు, అనకాపల్లిలో ఫార్మాసిటీ తదితర ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయుచున్నట్లు చెప్పారు. ఈ బహిరంగ సభకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు నరసన్నపేట నియోజకవర్గం తరపున భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జిల్లా, మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**పలాస, జనవరి 6(వార్త):** విశాఖపట్నంలో ఈ నెల ఎనిమిదో తేదీన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు పలాస నియోజవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె పలాస టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మోదీ విశాఖపట్నం వస్తున్నందున సభను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, యవ్వారి మోహనరావు, సప్ప నవీన్, కోరికల శంకర్ అంబటి కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు పాలవలస వైకుంఠరావు, స్వామీజీ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



**పాతపట్నం, జనవరి 6(వార్త):** ప్రధానమంత్రి మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని కూటమి శ్రేణలకు పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు.

పాతప ట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఐదు మండలాల అధికా రులు, నాయకులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. బహి రంగ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా చేద్దామని, ఉత్తరాంధ్ర వైభ వాన్ని చాటి చెప్పేలా ఉండాలన్నారు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేసి మోదీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## యువకుడి ఆత్మహత్య



సంతబొమ్మాళి, **జనవరి 6(వార్త):** దండుగోపాలపురం గ్రామంలో అద్దె ఇంట్లో నివాసముంటున్న వావిలాపల్లి సురేష్ (25) యువకుడు సోమవారం ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయనగరం జిల్లా మడకముడిగాం గ్రామానికి చెందిన సురేష్ మూలపేట పోర్ట్‌లో శ్రీ బాలాజీ మెన్ పవర్ సప్లైలో భోజనాలు అందించే వర్కర్‌గా కొద్ది కాలంగా పని చేస్తున్నాడు. మృతుడు సురేష్‌తో పాటు మరో ఇద్దరు ద0డుగోపాలపురంలో ఆ ఇంట్లో నివాసం ఉంటున్నారు. సోమవారం ముగ్గురు డ్యూటీకి వెళ్ళగా సాయంత్రం సురేష్ తన రూముకి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మలు ఎస్సై వై.సింహాచలం తెలిపారు.

## నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభం



**పలాస, జనవరి 6(వార్త):** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడము సురక్షితమని.. సుఖంతమని.. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం ఆమె పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో గల పలాస ఆర్టిసి డిపోలో 4 నూతన బస్సుల పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వము ప్రజలు సురక్షితముగా ప్రయాణం చేయడానికి ఆర్టీసీ సంస్థను మరింత అభివృద్ధి చేసే దిశలో పనిచేస్తుందన్నారు. ప్రజారక్షణ ప్రభుత్వ పనిచేస్తుందని ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ బస్సుల్లో ప్రయాణాలు చేసి కష్టాలు తెచ్చుకోవద్దని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అన్నారు. మన ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగముగా మహిళకు ఉచిత బస్సు ప్రయాణానికి ఇదొక మంచి ఆలోచనని అన్నారు. పలాస నుండి విశాఖపట్నం వెళ్లేందుకు ఒక బస్సు, ఇచ్ఛాపురం నుండి విశాఖపట్నం వెళ్లేందుకు మూడు బస్సులు ప్రతిరోజు తిరుగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జబాబురావు, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, మల్లిపెద్ది నరేంద్ర, సప్ప నవీన్, కోరికన శంకర్, ఆర్టీసీ డిపో మేనేజర్ రోణంకి సీతారామనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, వివిధ సంఘాల కార్మికులు,ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరిగడ్డి కొనుగోలు పేరుతో ధాన్యం బస్తాల దొంగతనాలు

**మందస, జనవరి 6(వార్త):** గిరిజన గ్రామాలలో వరిగడ్డి కొనుగోలు పేరుతో ధాన్యం బస్తాల దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఉద్దానం ప్రాంతం నుండి వచ్చామని గిరిజన గ్రామ రైతుల వద్దకు వెళ్లి ఒక్క ట్రాక్టర్ లోడు గడ్డి రూ.500లు డబ్బులు ఇస్తున్నారని వారు చెబుతున్నారు. రాత్రికి ట్రాక్టరు తెచ్చి పొలంలో ఉన్న ధాన్యం బస్తాలు దొంగతనాలు పాల్పడుతున్నారన్నారు. గత ఏడాది మందస మండలంలోని గిరిజన ప్రాంతాలలో సుమారు 60 నుండి 80 బస్తాలు, ఈ సంవత్సరంలో 58 బస్తాలు దొంగతనాలు జరిగాయని అని రైతులు చెబుతున్నారు.

ఇటీవల మందస మండలం కొంకడపుట్టి గ్రామంలోని ఓ రైతుకు చెందిన 25 బస్తాలు, బుడంబో, కిల్లోయి, ఛీపి గ్రామాల నుంచి సుమారు 58 బస్తాలు దొంగతనాలు జరిగినట్టు తెలుస్తోంది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.

ఈ సంఘ టనలపై మందస పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు శ్రీకాకుళం గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం ప్రతినిధులు తెలి పారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని వారు కోరారు.

## 12లోగా 20వేల పార్టీ సభ్యత్వాలు పూర్తి చేయాలి

**- టీడీపీ నేతలకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపు**

**మందస, జనవరి 6(వార్త):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం వేగవంతం చేసి, జనవరి 12వ తేదీ లోగా 20వేల సభ్యత్వాలు పూర్తి చేయాలని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష కోరారు. మందస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో శిరీష మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు మందస మండలంలో ఇప్పటి వరకు 15,200 పూర్తి చేశారని.. జనవరి 12వ తేదీ లోగా 20000 సభ్యత్వాలు పూర్తి చేయాలని కోరారు. ఈనెల 8న విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, డొంకురు తిరుపతి, రాజన మహేష్, ముడుమంచి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయవంతం చేద్దాం

**శ్రీకాకుళం, జనవరి 6 (వార్త):**ప్రధాని మోదీ విశాఖ పర్యటన విజయం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈనెల 8 తేదీన విశాఖపట్నం రానున్న నేపథ్యంలో సహచర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విశాఖ సర్కుట్ హౌస్ లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా చేద్దామని అన్నారు. ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటి చెప్పే విధంగా ఉండాలని అన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అని ఏర్పాట్లు పూర్తి చేద్దామని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, అందరూ సహకారంతో మోదీ పర్యటన విజయవంతం చేద్దామని అన్నారు. పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

### సమరశీల ప్రతిఘటనా పోరాటాలను నిర్మించడమే..

# చిలకమ్మకు నిజమైన నివాళి


*** సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కమిటి కార్యదర్శి తాండ్ర ప్రకాష్ * కొండలోగాంలో స్మారక సభ**



**మందస, జనవరి 6(వార్త):** భారతదేశంలో సమరశీల ప్రతిఘటనా పోరాటాలను నిర్మించడమే శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, ఆదివాసీ వీరవనిత సవర చిలకమ్మకు అర్పించే నిజమైన నివాళి అని సీపీఐ (యం.యల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటి కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. చిలకమ్మ 29వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలో చిలకమ్మ స్మారక స్థూపం వద్ద సీపీఐ (యం.యల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో జరిగిన స్మారక సభకు ప్రకాష్ అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. కామ్రేడ్ చిలకమ్మ కనపరిచిన పోరాట స్ఫూర్తితో ఆదివాసీ ఉద్యమం సాగాల్సిన చారిత్రక సందర్భంలో ఈ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, ఆదివాసీ ప్రజలు సభలో పాల్గొన్నారు. కేంద్రంలోను, రాష్ట్రంలోనూ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆదివాసీల హక్కులకు రక్షణగా ఉన్న చట్టాలను ఈ పాలకవర్గాలు బుట్ట దాఖలు చేసి, ఆదివాసీల హక్కులను కలరాయడానికే పూనుకుంటున్నాయని, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్ – బిజెపి ప్రభుత్వం మరింత పాసవికంగా వ్యవహరిస్తూ బహుళ జాతి సంస్థలకు, బడా కార్పొరేట్ వర్గాలకి దేశ సంపదను దోచిపెడుతోందని ఆయన అన్నారు. వీరి దోపిడీకి అడ్డుగా ఉండే అన్ని చట్టాలను సవరించడానికి, రద్దు చేయడానికి పూనుకుంటూ రాజ్యాంగ మౌలిక సూత్రాలను, నిబంధనలను తుంగలో తొక్కుతోందని తాండ్ర ప్రకాష్ విమర్శించారు. అందులో భాగంగానే నేడు మోడీ ప్రభుత్వం 1980 నాటి అటవీ సంరక్షణ చట్టంలోని నిబంధనలకు సవరణలను తెచ్చిందన్నారు. ఈ నూతన అటవీ సంరక్షణ చట్టం–2023 లోని నిబంధనలకు చేసిన సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వం అటవీ భూములను, అడవిలోని విలువైన సంపదను ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి సిద్ధమైందని అన్నారు. ఆదివాసీలను, ఇతర అటవీ నివాసులను అడవి నుండి తరిమివేసి వారి జీవితాలను రోడ్డున పడేయడానికి పూనుకుందనీ తరతరాలుగా బ్రిటిష్ కాలం నుండి తమ రక్త తర్పణలతో ఆదివాసీలు అనేక పోరాటాలు, ఉద్యమాలను సాగించి సాధించుకున్న చట్టపర హక్కులను, రాజ్యాంగపర రక్షణలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసే కుట్రలకు దిగిందని ప్రకాష్ విమర్శించారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా సంక్రమించిన హక్కులు, ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణగా ఉన్న 1/ 70 రెగ్యులేటింగ్ చట్టం, ఆదివాసీల గ్రామ సభలకు విస్తృత అధికారాలను కల్పించిన 'పీసా' చట్టం, పోడు భూములపై హక్కు పత్రాలను పొందే అటవీ హక్కుల చట్టం–2006 వంటి ఎన్నో ఆదివాసీ రక్షణ చట్టాలు, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన అటవీ సంరక్షణ చట్టం–2023 వల్ల రద్దవుతాయని ఆయన అన్నారు. అటవీ భూములన్నీ దోపిడీ వర్గాల పరమై ఆదివాసీలు అడవి నుండి తరిమివేతకు గురవుతారనీ అడవులు, అటవీ సంపద కార్పొరేట్ కంపెనీల పరమై, ఆదివాసీల జీవితాలు మరింత దుర్భరమవుతాయని అన్నారు. అటవీ సంరక్షణ పేరుతో ఆదివాసీలపై ఫారెస్ట్, పోలీసుల దాడులు పెరిగి హింస, అణిచివేత మితిమీరిపోతాయనీ అక్రమ కేసులతో ఆదివాసీలు జైల్లో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తాండ్ర ప్రకాష్ అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. సిపిఐ (ఎంఎల్) న్యూమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంకల మాధవరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పి డి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. వినోద్, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి,బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, పివైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు రాపాక మాధవరావు, అరుణోదయ నాయకుడు సొర్ర రామారావు, ప్రజా కళాకారుడు కుత్తం వినోద్, వంకల పాపయ్య, ఆదివాసి నాయకుడు బంగ్లా కుమార్ తదితరులు మాట్లాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాబృందం కళా ప్రదర్శనలతో స్మారక సభను ఉత్తేజ పరిచింది.

# అర్జీదారుల సమస్యలను త్వరితంగా పరిష్కరించండి

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, జనవరి 6 (వార్త):** మీకోసం అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగింది. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు తో కలసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు, అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించిన అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ వారికి 84 అర్జీలను సమర్పించారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల నుండి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వస్తున్న దరఖాస్తుదారుల సౌకర్యార్థం జిల్లా పరిషత్ సమావేశ మందిరం ఆవరణలో టెంటు, కుర్చీలు, త్రాగునీరు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి అల్పాహారం, టీ అందించడం జరుగుతుంది. అలాగే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు అధిక సంఖ్యలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన దరఖాస్తుల వస్తున్నందున ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి పరిష్కారం వేగవంతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మీకోసం ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో డిపిఓ కె. భారతీ సౌజన్య , జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాద రావు, జిల్లా బి సి సంక్షేమ శాఖ అధికారి అనురాధ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.టీ.వి.బాల మురళీ క్రిష్ణ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ , డ్వామా పి.డి బి.సుధాకర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలి**

జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 42 వినతులు అందాయి. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.



### ఆరో రోజు..

# 220 మంది అర్హత

*** కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు**
*** ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఎంపికలు**



**శ్రీకాకుళం క్రైం, జనవరి6 (వార్త):** పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా సోమవారం ఎచ్చెర్ల ఆర్మ్ మైదానంలో పురుష అభ్యర్థులు 220 మంది అభ్యర్థులు దేహ దారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ ఎంపికలు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నాడు 631 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా ఇందులో 364 మంది అభ్యర్థులు దేహ దారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 220 మంది అభ్యర్థులు క్వాలిఫైడ్ అయ్యారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ కొలత,1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు చేపట్టారు.

## మున్సిపల్ అధికారుల మానవత్వం




**శ్రీకాకుళం టౌన్, జనవరి 6 (వార్త):** శ్రీకాకుళంనగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో సోమవారం ఓ వృద్ధుడు కుప్పకూలిపోయాడు. దీన్ని చూసిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది వెంటనే ఆయన వద్దకు వెళ్లి సపర్యలు చేశారు. ఆయన వివరాలు తెలుసుకున్న అనంతరం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

## పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 6 (వార్త):** ఆమదాలవలస పట్టణంలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో కోటిపల్లి రాజు (23)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. సోమవారం ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో సీఐ పాడ్రంకి సత్యనారాయణ, ఎస్ఐ సనపల బాలరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నూడిల్స్ షాపులో పని చేస్తున్న కోటిపల్లి రాజుకు ఓ బాలికతో ఏడాదిగా పరిచయం ఉంది. రాజు బాలికను ప్రేమ పేరుతో వంచించాడన్నారు. ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడాడని తెలిపారు. ఆ బాలిక గర్భిణిగా ఉన్నట్లు తల్లిదండ్రులు గుర్తించి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని, రాజుపై పోక్సో కేసు నమోదుచేసి అరెస్టు చేశామన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546